www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

తెలుగు దిన పత్రిక

తెలంగాణ | శని వారం, 13 ఆగస్టు 2022 | ఎడిటర్ : గోసుకొండ వృద్విరాజు | సంపుటి - 07, సంచిక-124 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

# కూసుకుంట్లకు జై అంటున్న జనం

## రాజగోపాల్‌రెడ్డి కుట్రలు ఘనం

### టీఆర్ఎస్ నేతల అసమ్మతి వెనుకాల బీసీ సామాజికవర్గ ముఖ్యనేత వ్యూహం

### తాయిలాలతో టీఆర్ఎస్ నేతలకు రాజగోపాల్ వల





దండుమల్కపురం ఫంక్షన్ హాల్‌లో కూసుకుంట్లపై కుట్రల సమావేశం

- అన్ని సర్వేల్లోనూ కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి అనుకూలం
- టీఆర్ఎస్ శ్రేణులను గ్రూప్‌లుగా విడదీసేందుకు ఈటల ప్రయత్నం
- బీసీ నేత కనుసన్నల్లో అసమ్మతి నేతల మీటింగ్
- తాయిలాలను ఎరగా చూపుతూ టీఆర్ఎస్‌లో చిచ్చుపెట్టేందుకు రా.గోపాల్ యత్నం
- టీఆర్ఎస్ క్యాడర్‌ను ఆకర్షించేందుకు రాజగోపాల్ రెడ్డి తీవ్ర ప్రయత్నాలు
- వీటన్నింటికి సూత్రదారిగా టీఆర్ఎస్ బీసీ నేత ఉన్నట్లు వినికిడి
- కుట్రలను చేదించుటలో మంత్రి గుంతకండ్ల సఫలం

**దావత్**

**పేరుతో నేతల పిలుపు**

**తెరవెనుక బీసీ నేత, రాజగోపాల్‌రెడ్డి**

దండుమల్కపురం ఫంక్షన్ హాల్‌లో ప్రైవేట్ కార్యక్రమం అని చెప్పి టీఆర్ఎస్ పార్టీ నేతలను, ఎంపిటీసి,సర్పంచ్‌లను కొందరు నేతలు తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు. తీరా అక్కడికి వెళ్ళిన తరువాత మీటింగ్ అని చెప్పారని, కూసుకుంట్లతో మాకు ఎలాంటి విభేదాలు లేవని, మాకు ఎలాంటి సంబంధం లేకుండా మీటింగ్ ఏర్పాటు చేశారని ప్రజాప్రతినిధులు తెలిపారు. ఈ కుట్రల మీటింగ్ వెనుక ఓ బీసీ అగ్ర నేత, రాజగోపాల్‌రెడ్డి, ఈటల హస్తం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం

"మునుగోడు నియోజకవర్గంలో కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి సర్వేల్లో అనుకూలంగా రిపోర్టు ఉంది. జనంలో ఆదరణ ఉంది. అయినా కూడా మాకు నచ్చిన వ్యక్తిని నిలబెట్టామని, కూసుకుంట్లను అభ్యర్థిగా ప్రకటిస్తే పని చేయబోమని కొందరు నేతలు చెబుతున్నారు. వీరిలో అభ్యంతరం వ్యక్తం చేసే వారిలో కాంగ్రెస్ పార్టీ నుంచి మద్యంతరంగా టీఆర్ఎస్ పార్టీ లోకి వచ్చిన వలస నేతలే అని ఆ పార్టీ నేతలు చెప్పుకుంటున్నారు.



కూసుకుంట్లపై సొంత పార్టీలో ఓ బీసీ నేత, బీజేపీలో ఈటల, ఆర్.జీ పాల్ కుట్రలు

**హైదరాబాద్,ఆగస్ట్ 12 (సమ సమాజం):** మునుగోడు నియోజకవర్గంలో ప్రజలు టీఆర్ఎస్ పార్టీ నుంచి ఉపఎన్నికలలో కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి పేరును ప్రతిపాదించినట్లుగా ప్రగతి భవన్ నుంచి లీకులు వచ్చాయి. ఈ క్రమంలో టీఆర్ఎస్ పార్టీలో కొందరు అసంతృప్తి నేతలలు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని అభ్యర్థిగా బరిలోకి దించితే ఒప్పుకునేది లేదని తెగేసి చెబుతున్నారు. ఇటీవల మంత్రి బుజ్జగించినా సదరు నేతలు వినిపించుకోవడం లేదని తెలుస్తుంది. అంతటితో ఆగకుండా చౌటుప్పల్ మండలం దండుమల్కపురం సమీప ప్రాంతంలోని ఫంక్షన్ హాల్‌లో కొంత మంది టీఆర్ఎస్ కార్యకర్తలతో మీటింగ్ ఏర్పాటు చేశారు. ఆ మీటింగ్ ప్రధాన ఉద్యేశం మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ఉపఎన్నికలో టీఆర్ఎస్ అభ్యర్థిగా బీఫామ్ పొందితే మనం సహకరించవద్దు అని కొందరు అసంతృప్తి నేతలు వ్యాఖ్యలు చేశారు. వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నేతలలో కొందరు గతంలో కాంగ్రెస్ పార్టీ నుంచి టీఆర్ఎస్ పార్టీలోకి వలస వచ్చినవారే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెబుతున్నారు. ఈ నేపద్యంలో కొందరు ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే కూసుకుంట్లపై కక్ష్యపూరితంగా వ్యవహరిస్తున్నారని తెలుస్తుంది.

**అసంతృప్తి జ్వాల వెనకాల బీసీ నేత**

మునుగోడు వర్గపోరులో భాగంగా ఓ బీసీ నేత తన అనుచరులతో అసంతృప్తి జ్వాలలు రగిలేలా ఇలాంటి సమావేశాలు ఏర్పాటు చేయిస్తున్నారని, ఇలాంటి కుట్రల వెనుక ఆ బీసీ నేత హస్తం ఉన్నదని విశ్వసనీయ సమాచారం. కూసుకుంట్లకు టికెట్ వస్తుందని తెలిసిన రోజు నుంచి తరచూ కొందరు స్థానిక

2వ

## ఒకేదెబ్బకు రెండు పిట్టలు

మునుగోడులో గెలుపే లక్ష్యంగా ఎత్తులు

బిజెపి, కాంగ్రెస్‌లను దెబ్బ కొట్టే వ్యూహంలో కెసిఆర్



**హైదరాబాద్,ఆగస్ట్ 12 (సమ సమాజం):** మునుగోడు రాజకీయం క్షేత్రస్థాయికి చేరింది. అన్ని పార్టీలు ఉప ఎన్నికల పోరును కార్యక్షేత్రంలోనే తేల్చుకునేందుకు సమాయత్తమవుతున్నాయి. అధికార టిఆర్ఎస్ కూడా ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇక్కడ గెలవడం ద్వారా ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్న చందంగా కార్యాచరణ సిద్ధం చేసుకుంటోంది. మునుగోడులో ఎలాఐనా విజయం సాధించి తెలంగాణలో ఇక బిజెపి, కాంగ్రెస్‌లకు స్థానం లేదని నిరూపించాలన్న పట్టుదలతో ఉంది. అందుకే కెసిఆర్ స్వయంగా ఈ ఉప ఎన్నికను మానిటర్ చేస్తున్నారు. మరోవైపు మునుగోడు ఉపఎన్నికకు అన్ని రాజకీయ పార్టీలు సమాయత్త మవుతున్నాయి. ఇప్పటికే ప్రధాన పార్టీలు వ్యూహరచనలో తలమునకలై ఉన్నాయి. ఎలాగైనా సరే సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలన్న పట్టుదలతో కాంగ్రెస్.. ఈ ఎన్నికల్లో గెలిచి సత్తా చాటాలని భాజపా భావిస్తోంది. మరోవైపు అధికార తెరాస పట్టు సాధించేందుకు పావులు కదుపుతోంది. ఈ నేపథ్యంలో మునుగోడులో పోరు ప్రజలతో పాటు, తెలంగాణ వ్యాప్తంగా ఉత్కంఠను రేకెత్తిస్తోంది. అమిత్‌షా సభకు ముందుగానే మునుగోడు కేంద్రంగా ఈ నెల 20న లేదా 19న తెరాస సీఎం కేసీఆర్ సభకు సన్నాహాలు

2వ

## రాష్ట్ర వ్యవహారంపై రాహుల్ వద్దే తేల్చుకుంటా

మునుగోడు వ్యవహారం నాతో చర్చించడం లేదు

నన్ను పార్టీ నుంచి పంపించాలన్న కుట్ర జరగుతోంది

తనను తిట్టిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోరు

మీడియాతో ఎంపి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**హైదరాబాద్,ఆగస్ట్ 12 (సమ సమాజం):** మునుగోడు విషయంలో కాంగ్రెస్ నేతల తీరుపై గుర్రుగా ఉన్న ఎంపి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యవహారాన్ని రాహుల్‌గాంధీ దగ్గరనే తేల్చుకుంటానని ప్రకటించారు. ఆయనకు రాష్ట్ర నాయకత్వానికి మధ్య ప్రచ్ఛన్న యుద్ధం కొనసాగుతోంది. తమ్ముడు రాజగోపాల్‌రెడ్డి రాజీనామాతో మారిన సమీకరణాలతో.. అధిష్ఠానం ఆయనను పక్కకుపెట్టినట్టు కనిపిస్తోంది. శనివారం నారాయణపూర్ నుంచి చౌటుప్పల్ వరకు సాగనున్న పాదయాత్రకు పిలుపు రాకపోవటం.. మునుగోడు ఉపఎన్నికల మీటింగ్ గురించి సమాచారం లేకపోవటం ఆ అనుమానాలకు బలం చేకూరుస్తున్నాయి. అయితే.. పార్టీలో చోటుచేసుకుంటున్న

2వ

## మునుగోడులో టిఆర్ఎస్‌దే విజయం



ఉప ఎన్నిక గెలుపుతో బిజెపి, కాంగ్రెస్‌లకు గుణపాఠం

సిఎం సభ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి జగదీశ్వర్ రెడ్డి

**నల్గొండ, ఆగస్ట్ 12 (సమ సమాజం):** మునుగోడు ఉప ఎన్నికలో టీఆర్ఎస్ విజయం ఖాయమని రాష్ట్ర విద్యుత్ శాఖమంత్రి జగదీశ్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మునుగోడు ఉప ఎన్నికలో బీజేపీ, కాంగ్రెస్ తమకు పోటీ కానేకావని స్పష్టం చేశారు. ఈ ఎన్నికతో రెండు పార్టీలకు బుద్ది చెబుతామని అన్నారు. మునుగోడులో ఈ నెల 20న జరగనున్న కేసీఆర్ బహిరంగ సభ స్థలాన్ని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, జిల్లా ఎస్పీ రాజేశ్వరితో కలిసి మంత్రి జగదీశ్ రెడ్డి పరిశీలించారు. అనంతరం సభకు కావాల్సిన ఏర్పాట్ల గురించి వారితో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఈ నెల 20న మునుగోడులో కేసీఆర్ బహిరంగ సభ ఉంటుందన్న ఆయన... బీజేపీ అసమర్థ పాలన, టీఆర్ఎస్ అభివృద్ధి పాలనపై సీఎం కేసీఆర్ మాట్లాడుతారని తెలిపారు. త్వరలోనే టీఆర్ఎస్ లోకి భారీగా వలసలు ఉంటాయన్నారు. టీఆర్ఎస్ లో అసంతృప్తులు లేరని... కేవలం ఆశావహులు మాత్రమే ఉన్నారని చెప్పారు. జాతీయ రాజకీయాల దృష్ట్యా వామపక్షాల మద్దతు తమకే ఉంటుందని మంత్రి తెలిపారు. ఇక రాజీనామా తర్వాత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరింత అభివృద్ధి చెందారని మంత్రి ఎద్దేవా చేశారు. ఇక... కాంగ్రెస్ పార్టీ నుంచి మునుగోడు ఎమ్మెల్యేగా గెలిచిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఈ నెల 8న తన ఎమ్మెల్యే పదవికి, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. మునుగోడు అభివృద్ధి

2వ

## రేవంత్‌రెడ్డికి సవాల్‌గా మారిన మునుగోడు



గెలుపు కోసం తాడోపేడో తేల్చుకోవాల్సిన సమయం

ఉప ఎన్నికలో గెలిస్తే హీరో..లేకుంటే జీరోయే

ఫలితం తేడా వస్తే సీనియర్ల బంతాట తప్పదు

అందుకే వరుస కార్యక్రమాలతో ముందుకు పోయేలా ప్లాన్

**నల్లగొండ, ఆగస్ట్ 12 (సమ సమాజం):** మునుగోడు ఉప ఎన్నిక ఇప్పుడు కాంగ్రెస్‌కు సవాల్‌గా మారింది. ఇక్కడ గెలవడంతో పాటు బలిమిచాటుకోవడం ద్వారా వచ్చే సార్వత్రిక ఎన్నికలకు రంగం సిద్దం చేసుకోవాలనిచూస్తోంది. ఈ ఎన్నిక కాంగ్రెస్ నేతలకన్నా పిసిసి చీఫ్ రేవంత్‌కు జీవన్మరణ సమస్యగా మారింది. ఇక్కడ ఉనికిని చాటితేనే రేవంత్ నాయకత్వానికి సవాల్ ఉండదు. ఇప్పటికే రేవంత్‌పై ముప్పేట దాడి చేస్తున్న కాంగ్రెస్ నేతలు ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఓడిపోతే బంతాట ఆడుకుంటారు. అందుకే సాధారణ ఎన్నికలకు సెమీ ఫైనల్‌గా భావిస్తున్న మునుగోడు ఉప ఎన్నికలో చావో రేవో తేల్చుకునేందుకు రేవంత్ రెడ్డి సిద్ధమయ్యారు. ఈ ఎన్నికలోనూ ఓటమిపాలైతే పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఖాతాలో మరో ఓటమి నమోదై ఆయన ప్రతిష్ఠకే భంగం వాటిల్లే ప్రమాదం ఉండటంతో వరుస కార్యక్రమాలకు పీసీసీ సిద్ధమైంది. ఇక నుంచి ఏ కార్యక్రమమైనా మునుగోడు కేంద్రంగా చేపట్టాలని ఆ మేరకు గెలుపు దిశగా వెళ్లాలని కాంగ్రెస్ పెద్దలు నిర్ణయించారు. నల్లగొండ జిల్లాకు చెందిన సీనియర్ నేతలు, ఎంపీలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తుండగా ఇతర నేతలతో రేవంత్‌రెడ్డి కార్యాచరణకు సిద్ధమయ్యారు. ఓ వైపు అభ్యర్థి ఎంపికకు కసరత్తు చేస్తూనే మరోవైపు మునుగోడు నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు తిరుగులేదన్న సంకేతాలు

2వ

## నా రాజీనామాతోనే ప్రభుత్వలో కదలిక



ఫీల్ట్ అసిస్టెంట్లకు మళ్లీ ఉద్యోగాలు

నియోజవర్గంలో అభివృద్దికి నిధులు

నేతన్నలకు బీమా పథకంతో పాటు ప్రత్యేక దృష్టి

అవినీతిపై మాట్లాడే హక్కు టిఆర్ఎస్‌కు లేదు

పార్టీ మారేదుంటే ఆ 12మందితోనే మారేవాణ్ణి

మీడియా సమావేశంలో రాజగోపాల్ రెడ్డి

**యాదాద్రి భువనగిరి, ఆగస్ట్ 12 (సమ సమాజం):** మునుగోడు పాలిటిక్స్ ఒక్కసారిగా వేడాక్కాయి. నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన తర్వాత ప్రస్తుత రాజకీయాలపై కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్పందించారు. రాజగోపాల్‌రెడ్డి శుక్రవారం మునుగోడులో మీడియాతో మాట్లాడుతూ.. తన రాజీనామా తర్వాతే ప్రభుత్వంలో కదలిక వచ్చిందన్నారు. తన రాజీనామా తర్వాతే చేనేత కార్మికులకు పెన్షన్ ప్రకటించారు. రాజగోపాల్ రెడ్డి గురించి ఎన్ని ఆరోపణలు చేసిన ప్రజలు నమ్మరన్నారు. రాజకీయాలకు వచ్చి డబ్బులు ఖర్చు చేస్తున్నా కానీ సంపాదించడం లేదన్నారు. డబ్బుల కోసం అయితే 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యే లు టిఆర్ఎస్‌లోకి పోతే ఆ టైం లో తాను జంప్ అయ్యేవాడినని చెప్పారు. తాను అలా చేయలేదని..తనను ప్రజాప్రతినిధిగా ఎన్నుకున్న ప్రజలకోసం ఏ త్యాగానికి అయినా సిద్ధమన్నారు. మునుగోడు నియోజకవర్గంలో రోడ్లు వేస్తున్నారు. ఇప్పుడే నియోజకవర్గంలో అభివృద్ధిపై దృష్టి పెడుతున్నారని అన్నారు. అందరు

2వ

## సంపాదకీయం

# భారత్ విభజన ఓ చీకటి అధ్యాయం !

భారత స్వాత్ర్య ఉద్యమ చరిత్రలో బ్రిటిషర్ల దమనకాండ కన్నా విభజన వల్ల జరిగిన రక్తపాతమే అధికం. దాదాపు పదిలక్షల మంది ఊచకోతకు గురయ్యారంటే ఆ రక్తపాతం ఎంతగా పారిందో నేటితరం తెలుసు కోవాలి. విభజన గాయాలను అధ్యయనం చేయాలి. బ్రిటిష్ వారు పోతూపోతూ దేశాన్ని మతప్రాతిపదకన విభజించే చిచ్చు పెట్టారు. ఒక్కటిగా ఉన్న భారతావనిని ముక్కలు చేశారు. వారు పాలించడం వల్ల కలిగిన నష్టం కంటే విభజించడం వల్ల కలిగిన నష్టం పూడ్చుకోలేకుండా పోయింది. విభజనను ఆపడానికి నాటి నాయకులకు శక్తి లేకుండా ..స్వాతంత్ర్యంతో ముడిపెట్టి చేతులు కట్టేశారు. ఓ రకంగా ఈ నష్టం భూమ్యా కాశాలు ఉన్నంత వరకు తీరవనే చెప్పాలి. మతతత్వం సమాజాన్ని కార్చిచ్చులా భస్మీపటలం చేస్తుందని ఆనాటి విభజన రుజువు చేసింది. విద్వేషం, విధ్వంసాలతో కూడా విభజన సాగింది. భరతమాత నుదిటిపై నేటికీ ఆ రక్తపు చారికలు ఇంకా వరదలా కొనసాగుతూనే ఉన్నాయి. అలాంటి మహా భయంకరమైన విధ్వంసం, విషాదం మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు చోటు చేసుకొంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సంబరం కంటే దేశ విభజన కారణంగా జరిగిన రక్తతర్పణమే భయంకరంగా మారింది. లక్షలాది అమాయకులు ఊచకోతలకు గురయ్యారు. వందలాది మహిళలు అత్యాచారాలకు గురయ్యారు. ఆస్తులు లూటీ అయ్యాయి. ఆజదీకా అమృత్ మహోత్సవాలు జరుగుతున్న వేళ దేశం మరోమారు నాటి విభజన రక్తపాతాన్ని గుర్తు చేసుకోవాలి. మతతత్వం మనుషులను ఎంత భయంకరంగా విభజిస్తుందో అన్నది మరువలేని గాయంగా మిగిలింది. అన్నదమ్ముల్లా ఉన్న హిందూముస్లింలను మతం పేరుతో బ్రిటిషర్లు విభజించి పాలించారు. ఇదే మీ దేశం అంటూ గీతగీసి వెళ్లారు. జాతీయోద్యమం కులమతాలకు అతీతంగా ప్రజలను ఏకం చేస్తుంటే కొందరు రాజకీయ నేతలు స్వార్థ ప్రయోజనాలను ఆశించిన మతతత్వం రాజేసారు. 1937 నాటికి అది మరింత తీవ్రస్థాయి దాల్చింది. జిన్నా ద్విజాతి సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చాడు. ఈ దేశంలో ఇతర మతాలను అణచివేసి హిందూరాజ్యం స్థాపించాలని కాంగ్రెస్ ప్రయత్ని స్తోందని జిన్నా రెచ్చగొట్టుడు ప్రసంగాలు మొదలెట్టాడు. గాంధీ మీద తీవ్ర విమర్శలు చేశాడు. దీంతో సొంత గడ్డ మీద హిందువులంతా బానిసలయ్యారు. విభజిత పాక్ భూభాగం నుంచి గుట్టలుగా శవాలు ఢిల్లీకి వచ్చాయి. అక్కడి హిందువులను ఊచకోత కోశారు. బలవంతపు మతమార్పిళ్లతో ఇస్లాంలోకి మార్చారు. ఇది మన స్వాతంత్ర్య చరిత్రలో మిగిలిన విషాదం. భారత జతీయోద్యమంలో లక్షలాది హిందూ ముస్లిం ప్రజలు భుజం భుజం కలుపుకొని కదన రంగంలో దుముకుతుండడగా జిన్నా విద్వేషాగ్నిని రగిలించే ప్రయత్నాలకు బ్రిటిషర్లు ఆజ్యం పోశారు. మతాలకు అతీతంగా అనేకమంది నాయకులు స్వరాజ్యం కోసం పోరాడుతుండగానే ముస్లిం లీగ్ చాపకింద నీరులాగ మతతత్వాన్ని విస్తరింపచేసింది. 1947 నాటికి అది పతాక స్థాయికి చేరింది. పోతూ పోతూ బ్రిటీషు వాళ్లు మన దేశాన్ని రెండు ముక్కలుగా చీల్చటానికి, ఇంకా అనేక కార్చిచ్చులు రగిలించటానికి కారణమైంది. మరోపక్క కాంగ్రెస్‌లో అధికారం కోసం జరిగిన ముఠా తగాదాలు కూడా దీనిని చిన్నదిగా చేశాయి. తూర్పు బెంగాల్లో మైనార్టీలుగా ఉన్న హిందువుల మీద దాడులు జరిగాయి. గాంధీ అప్పటి కాంగ్రెస్ అధ్యక్షుడు కృపలానీని వెంటబెట్టుకొని అక్కడికి వెళ్లాడు. ఈలోగా బీహార్లో మత గొడవలు తలెత్తాయి. ఒకదానికి ఒకటి ప్రతీకారంగా మతతత్వవాదులు ప్రజలను రెచ్చగొట్టారు.హిందూ - ముస్లిం విబేధాలు దారుణ మారణ కాండకు దారి తీస్తున్నందుకు గాంధీ చాలా చింతించాడు. ఇండియా వైస్రాయిగా 1947 మార్చి 24న వచ్చిన మౌంట్ బాటన్ ... ఏప్రిల్‌లో రాజకీయ పక్షాలతో చర్చలు జరిపాడు. తరువాత 1947 ఆగస్టు 14 అర్ధరాత్రి దేశ విభజన, స్వాతంత్య ప్రకటన చేశాడు. ముస్లింలీగు ప్రేరేపించిన మతతత్వం విజృంభించి, దేశం రెండుగా విడిపోయింది. బెంగాల్‌లోని లీగ్ నాయకులకు, జిన్నాకు మధ్య విభజన విషయంలో భిన్నాభిప్రాయాలు ఏర్పడ్డాయి. మతపరమైన విభజన ఎన్నెన్ని సమస్యలకు దారి తీస్తాయో చెప్పటానికి ఇవన్నీ ఉదాహరణలు. ఇలా స్వాతంత్ర్య ఉత్సాహం ఉవ్వెత్తున లేవాల్సిన 1947 ఆగస్టు 15.. మతకలహాల నీడతో అంధకారమై పోయింది. మత ప్రతిపాదికన ప్రజలు తమ తమ ఇళ్లను, ఆస్తులను వదిలి వెళ్లిపోవాల్సి వచ్చింది. అదే సందర్భంలో పిచ్చెక్కిన మతోన్మాదం దాడులకు, దౌర్జన్యాలకు బరి తెగించింది. హత్యలూ, అత్యాచారాలూ, అత్యంత అమానవీయ సంఘటనలూ చోటు చేసుకున్నాయి. రైళ్లు రక్తసిక్త మృతదేహాలతో, అగమ్య గోచర విషాద వదనాలతో ప్రయాణించాయి. వేలాదిమంది ప్రజలు తమ ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా తమదైన నేలను వదిలి, తమది కాని గడ్డ మీదికి కేవలం మతం ప్రతిపాదికన కాందిశీకులుగా తరలిపోవాల్సి వచ్చింది. మధ్యలోనే ఎంతోమంది తమ కుటుంబ సభ్యులను కోల్పోయారు. మహిళలను ఎవరెవరో బలవంతంగా లాక్కెళ్లిపోయి, అత్యాచారాలకు పాల్పడ్డారు. వేలాదిమంది బాలబాలికలు తమ తల్లిదండ్రుల నుంచి తప్పిపోయి, అనాథలై పోయారు. ప్రజలకు అవసరమూ, ఆమోదమూ లేని దేశ విభజన సృష్టించిన ఇలాంటి విషాద, విచారకర దృశ్యాలెన్నో ఇప్పటికీ కళ్లముందు కదలాడుతున్నాయి. దాదాపు 2 శతాబ్దాలు ఏండ్లు భారత్‌ను ఏలిన ఆంగ్లేయులు వెళ్లిపోతూ భారత ఉపఖండంలో పెట్టిన విభజన చిచ్చు నేటికీ దాయాది దేశాల మధ్య రగులు తూనే ఉన్నది. దేశ విభజనతో సుమారు 1.5 కోట్ల మంది పౌరులు నిరాశ్రయులయ్యారు. దాదాపు పది లక్షల మందిని బలితీసుకున్న విభజన గీత నేటికీ రక్తమోడుతూనే ఉన్నది. భారతదేశం నుంచి 60 లక్షల మంది పాకిస్థాన్‌కు తరలిపోతే.. పాకిస్థాన్ నుంచి 40 లక్షల మందికి పైగా భారతదేశానికి తరలి వచ్చారు. ఈ సందర్భంగా జరిగిన ఘర్షణల్లో రెండు లక్షల నుంచి 20 లక్షల మంది వరకు మరణించారని చరిత్ర చెబుతోంది. చట్టాన్ని అమలు చేసే వారు లేక మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరిగాయి. రాజకీయ అనిశ్చితికి దారి తీసింది. భారత్, పాకిస్థాన్ మధ్య జమ్ము కశ్మీర్ సరిహద్దుగా గీసిన సరిహద్దు రేఖ రెండు దేశాలనూ ఈనాటికీ వెంటాడుతూనే ఉన్నది. దీనికి తోడు సంస్థానాలు సొంతంగా నిర్ణయం తీసుకోవచ్చునని బ్రిటిష్ ప్రభుత్వం చేసిన ప్రకటన.. మరింత గాయం రేపింది. మొత్తంగా ఇప్పుడున్న భారత్ కదుట పడడానికి చాలాకాలమే పట్టింది. మనదేశంలో ప్రజలు స్వేచ్ఛగా బతికేలా ఆనాటి నుంచి నేటి ప్రభుత్వాల వరకు శాయశక్తులా యత్నించడంతో ఇప్పుడు భారత్ అభివృద్ధి దిశగా పయనిస్తోంది. కానీ విభజిత పాక్, బంగ్లాలో ఇంకా ఛాందసవాద మతోన్మాదుల విజృంభణకారణంగా అక్కడి మైనార్టీ హిందువులు విధిలేక మతం మారడమో, హత్యలకు గురికావడమో జరుగుతూనే ఉంది.

**పృథ్విరాజ్ గోసుకొండ**
ఎడిటర్

# రేవంత్‌రెడ్డికి సవాల్‌గా మారిన మునుగోడు

(మొదటి పేజీ తరువాయి..)పంపేందుకు ఈ నెల 13 నుంచి 20 వరకు వరుస కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ క్రమంలో రాజగోపాల్‌రెడ్డి సోదరుడు వెంకట్‌రెడ్డి ఎలాగూ సహకరిం చకపోగా తమ్ముడి గెలుపునకే ప్రాధాన్యం ఇస్తారు. అందుకే రేవంత్ ఒంటరి పోరాటం చేయక తప్పదు. ఈ క్రమంలో వరుస కార్యక్రమాలతో మునుగోడులో తన ప్రణాళికను సిద్ధంచేశారు. పాదయాత్రల తో పాటు చిన్నచిన్న సబలతో ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించారు. ఈనెల 21న చండూరులో జరిగే సభలో అమిత్ షా సమక్షంలో రాజగోపాల్ రెడ్డి బీజేపీలో చేరనున్నారు. సభ జరిగే రోజు లేదా ముందు రోజు పెరిగిన వంటగ్యాస్ ధరలను నిరసిస్తూ నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఖాళీ సిలిండర్లతో గ్రామగ్రామాన బీజేపీకి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేసేలా కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించారు. నల్లగొండ, యాదాద్రి జిల్లాల పార్టీ అధ్యక్షులు, మునుగోడు ఎన్నికల ఇన్‌చార్జి రాంరెడ్డి దామోదర్‌రెడ్డిలతో పాటు ఐదుగురు సభ్యుల కమిటీతో రేవంత్‌రెడ్డి, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్కం ఠాగూర్ గురువారం హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. ఆజాదీకా అమృతోత్సవ్‌లో భాగంగా కాంగ్రెస్ నేతలు 75 రోజుల పాటు దేశ వ్యాప్తంగా పాదయాత్రలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు కుంభం అనిల్ కుమార్‌రెడ్డి భువనగిరి నియోజకవర్గాల్లో పాదయాత్ర చేపట్టారు. ఈ నెల 13న ఆయన యాత్ర మునుగోడు నియోజకవర్గంలోని నారాయణ పురం, చౌటుప్పల్ మండలాల్లో కొనసాగుతుంది. ఈ తరుణంలో అనిల్ కుమార్‌రెడ్డితో కలిసి నారాయణపురం నుంచి చౌటుప్పల్ వరకు 15 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేసేందుకు రేవంత్ రెడ్డి సిద్ధమయ్యారు. అలాగే, ఈ నెల 14 నుంచి 17 వరకు వరుసగా మండలాల వారీగా పార్టీ నేతలతో రేవంత్ రెడ్డి సమావేశం కానున్నారు. ఈ నెల 14న నాంపల్లి, మర్రిగూడ, 15న స్వాతంత్య దినోత్సవం సందర్భంగా విరామం, 16న మునుగోడు, చండూరు, 17న నారాయణపురం, చౌటుప్పల్ మండలాల్లో సమావేశాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ నెల 20న రాజీవ్‌గాంధీ జయంతి ఉత్సవాలను మునుగోడు నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. నియోజకవర్గంలో 175 గ్రామాలు ఉండగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 175 మంది కాంగ్రెస్ కీలక నేతలకు ఒక్కొక్క గ్రామాన్ని కేటాయించి వారి ఆధ్వర్యంలో గ్రామంలో ఒకరోజు పాదయాత్రకు షెడ్యూల్ ఖరారు చేశారు. ఈ కార్యక్రమంతో రాష్ట్రంలోని సీనియర్ నేతలంతా మునుగోడులో ప్రత్యక్షం కానున్నారు.

# డ్వాక్రా నిధులు విడుదల చేయండి

## సిఎం కెసిఆర్‌కు బండి లేఖ

**హైదరాబాద్,ఆగస్ట్ 12 (సమ సమాజం):** డ్వాక్రా సంఘాల్లోని మహిళలకు కేటాయించిన నిధులను రాఖీ పౌర్ణమి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ రాశారు. సెర్ప్, మెప్మా, ఎస్‌జీహెచ్‌లకు చెల్లించాల్సిన రూ.4 వేల కోట్ల వడ్డీ బకాయిలు పేరుకుపోయినట్లు చెప్పారు. తెరాస ఎనిమిదేళ్ల పాలనలో డ్వాక్రా సంఘాలను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. 2 021-22 బడ్జెట్‌లో మహిళా గ్రూపులకు వడ్డీ చెల్లించేందుకు రూ.3 వేల కోట్లు కేటాయించారని బండి సంజయ్ తెలిపారు. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.1250 కోట్లు కేటాయించినా ఇప్పటివరకు నిధులు విడుదల కాలేదన్నారు. ప్రభుత్వం నుంచి వడ్డీ రాయితీ లభిస్తుందనే ఆశతో మహిళలు ఎదురుచూస్తున్నారని.. ప్రభుత్వ నిర్వాకంతో రుణాలు తీసుకున్న వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు బండి సంజయ్ పేర్కొన్నారు.

# రాష్ట్రపతి ముర్ముతో రఘురామ దంపతుల భేటీ

## కస్టోడియల్ టార్చర్ అంశంపై వివరణ

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 12 (సమ సమాజం):** నరసాపురం ఎంపీ రఘురామ కృష్ణంరాజు సతీసమేతంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో తనపై జరిగిన కస్టోడియల్ టార్చర్ అంశాన్ని రాష్ట్రపతికి వివరించినట్లు చెప్పారు. మాతృభాష ఉండేలా చూడాలని చెప్పినందుకు తనపై అనర్హత వేటు వేయాలని చూశారని, ప్రభుత్వం తనను తీసుకెళ్లి కొట్టిన అంశాన్ని వివరించానన్నారు. అలాగే ఏపీరాష్ట్ర ఆర్థిక పరిస్థితులను, ఆర్థిక సంక్షోభం ఇతర అంశాలను రాష్ట్రపతికి వివరించానన్నారు. వైఎస్ విజయమ్మ ప్రమాదం నుంచి క్షేమంగా బయట పడినట్టు తెలిసిందన్నారు. విజయమ్మతో మాట్లాడే ప్రయత్నం చేశానన్నారు. కేవలం 3500 కిలోమీటర్లు మాత్రమే కారు తిరిగిందని, ట్యూబ్ లెస్ టైర్స్ ఒకేసారి రెండు టైర్లు బద్దలయ్యాయని, ఇలాంటి ఘటన అసంభవమన్నారు. ఇది నమ్మశక్యంగా లేదని, దీనిపై సీఎం జగన్ తగు విచారణ జరిపించాలన్నారు. సీఎం దుష్ట చతుష్టయం అని అంటారు కాబట్టి విచారణ జరిపించాలన్నారు. ఏదో కుట్ర ఉందని, సీఎం కుటుంబంలో ఇలా జరగటం బాధాకరమన్నారు. గతంలో బాబాయ్‌ని కోల్పోయారని రఘురామ అన్నారు. విద్యుత్ వాతప్రజలపై ట్రూ అప్ ఛార్జీలు వేసేందుకు సీఎం జగన్ ప్రయత్నం చేస్తున్నారని రఘురామ అన్నారు. రూ.3 వేల కోట్లకు బాదుడే బాదుడుకు సిద్ధమవుతు న్నారని అన్నారు. ఆనాడు విద్యుత్ బిల్లులు పెంచమని, చంద్రబాబు ప్రభుత్వం మోసం చేసిందని అన్నారని, ఇప్పుడు సీఎం విద్యుత్ చార్జీలు పెంచుకుంటు పోతున్నారని, చేతకాని తనంతో విద్యుత్ కాంట్రాక్టులు క్యాన్సల్ చేశారని విమర్శించారు. భారతదేశం పుట్టిన తర్వాత ఇలాంటి విద్యుత్ ట్రూ అప్ చార్జీలు ఎక్కడ లేవన్నారు. ఏపీలో ఆస్తుల విలువ సగానికి సగం పడిపోయిందన్నారు. హైదరాబాద్ ఆస్తుల విలువ 10 రేట్లు పెరిగిందన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉచితలు వద్దన్నారని వార్తలు వచ్చాయని, సంక్షేమం ఉండాలి కానీ సంక్షోభంలోకి రాష్టాన్ని నెట్టకూడదన్నారు. మహిళ కమిషన్ కూడా ఎంపీ గోరంట్ల మాధవ్ అంశంపై స్పందించిందని, ఎంపీ జస్బిర్ సింగ్ గిల్ ప్రధానమంత్రికి లేఖ రాశారన్నారు. ప్రైవేట్ ల్యాబ్స్ ఉన్నాయి.. ఆ వీడియో ఇవ్వొచ్చునని సూచించారు. సూపర్ మ్యాన్, బాడ్ మ్యాన్ సినిమాలు ఉన్నాయి...ఇప్పుడు న్యాడ్ మ్యాన్ సినిమాలు అంటున్నారని రఘురామ కృష్ణంరాజు అన్నారు.

# నా రాజీనామాతోనే ప్రభుత్వంలో కదలిక

(మొదటి పేజీ తరువాయి..)సర్పంచ్‌లకు ఫోన్లు చేస్తున్నారు. నా రాజీనామాతోనే ఫండ్స్ రిలీజ్ చేశారు. ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలు ఉన్న దగ్గర ప్రభుత్వం నిధులను అడ్డుకుంటోంది. ప్రభుత్వం వివక్షతో ప్రవర్తిస్తోంది. మొన్నటి వరకు మునుగోడుపై మాట్లాడితే సీఎం కేసీఆర్ స్పందించలేదు. కానీ, తన రాజీనామా తర్వాత సీఎం కేసీఆర్ మునుగోడుకు వస్తున్నారు. నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నిధులు కేటాయించలేదు. కానీ.. ఉప ఎన్నికల్లో గెలిచేందుకు మాత్రం వేల కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధపడుతున్నారంటూ మండిపడ్డారు. రాష్ట్రంలో కుటుంబ పాలన, అరాచక పాలన పోవాలటే మునుగోడు ప్రజల తీర్పు చరిత్ర లో నిలిచిపోవాలని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. మునుగోడు లో జరుగుతున్న పోరు పార్టీల మధ్య కాదు అవినీతి పాలనపై,కేసీఆర్ అరాచకాలపై జరుగుతున్న ఉప ఎన్నిక అని చెప్పారు. ఉప ఎన్నికలు వస్తేనే టీఆర్ఎస్ ప్రభుత్వం, అధికార యంత్రాంగం స్పందిస్తుందన్నారు. తన రాజీనామా తర్వాత పెన్షన్ లు ఇస్తున్నారన్నారు. చేనేత కార్మికుల కష్టాలపై తాను గళం విప్పాక ప్రత్యేక పథకం పెట్టారని తెలిపారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను కలవగానే కేసీఆర్ సర్కార్ గట్టుప్పల్ మండలం ప్రకటించిందన్నారు. ఇప్పటి వరకు మునుగోడు నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యమన్నారు. తన రాజీనామాతో ఇప్పుడు ఒక్కో గ్రామపంచాయతీకి రూ.20 లక్షల చొప్పున ఇస్తున్నారని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. ఎన్ని సమస్యలు ఉన్నా ప్రతిపక్ష ఎమ్మెల్యే కు సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వరు. కానీ ఉపఎన్నికలు వస్తే కోట్లు కుమ్మరించి గెలవాలని చూస్తారని మండిపడ్డారు. మునుగోడులో ఉప ఎన్నికలు రావడంతోనే ఈనెల 20 న సీఎం సభ పేరుతో కేసీఆర్ మునుగోడుకి వస్తున్నారన్నారు. చౌటుప్పల్ నుండి పుట్టపాక వరకు రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారిందన్నారు. ఇప్పుడు 5 కోట్ల నిధులతో ఆగమేఘాల మీద హడావుడిగా రోడ్లు వేస్తున్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వం కనీసం అభివృద్ధి కోసం ఫండ్ ఇవ్వదని ఆరోపించారు. ఫీల్డ్ అసిస్టెంట్స్ ని పట్టించుకోని ప్రభుత్వం ఉప ఎన్నికలు వచ్చే సరికి వారిని విధుల్లో తీసుకుంటుందన్నారు. మిషన్ భగీరథ వాటర్ పేరుతో కోట్లు ఖర్చు చేసినా ప్రజలకు తాగునీరు ఇవ్వలేదన్నారు. శివన్నగూడ ప్రాజెక్టు పూర్తి చేయలేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లా మంత్రి జగదీష్ రెడ్డికి సోయి లేదని.. 24 గంటల కరెంట్ ఇవ్వడంలేదన్నారు. రాజకీయాల్లో తన ఎదుగుదలను ఓర్వలేక కాంట్రాక్ట్ ల కోసం బీజేపీలోకి జాయిన్ అయ్యారని టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తున్నా యన్నారు. రైతుబంధు కౌలు రైతులకు ఇవ్వాలన్నారు. రుణమాఫీ పేరుతో అన్నదాతలను కన్నీళ్లు పెట్టిస్తుందన్నారు. నిరుద్యోగులను కేసీఆర్ మోసం చేశారన్నారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి ఎనిమిదేండ్లు అవుతున్నా నిరుద్యోగ భృతి ఇవ్వలేదన్నారు. దళితుడిని ముఖ్యమంత్రి చేస్తా అన్న టీఆర్ఎస్ ప్రభుత్వం అఖఖ దళితుడు ఉంటే ఓర్వలేకపోయిందన్నారు. అధికారం కోసం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారన్నారు. రాష్ట్రంలో కేజీ టూ పీజీ ఉచిత విద్య అమలుకావాలని రాజగోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు.

# మునుగోడులో పోటీపై నీ సలహాలు అక్కర్లేదు

## బండి సంజయ్‌కు నారాయణ కౌంటర్

**హైదరాబాద్,ఆగస్ట్ 12 (సమ సమాజం):** ఇటీవల మెగాస్టార్ చిరంజీవిపై ఘాటు వ్యాఖ్యలు చేసి ఆ తర్వాత క్షమాపణలు చెప్పిన సీపీఐ నారాయణ ఈసారి తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌పై మాటల తూటాలు పేల్చారు. కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి పోటీ చేసిన మునుగోడులో పోటీ చేయాలా? వద్దా? అనేది తాము తేల్చుకుంటామని.. మా గురించి చెప్పడానికి నువ్వెవవడివి కోన్ కిస్కావి అంటూ నిప్పులు చెరిగారు. బండి సంజయ్ పనికిమాలిన మాటలు మాట్లాడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలని హెచ్చరించారు. దమ్ము ధైర్యం గురించి మాట్లాడే అర్హత బండి సంజయ్‌కు ఎక్కడిదని నారాయణ ప్రశ్నించారు. ఢిల్లీ నుంచి వచ్చిన దమ్ము తప్పితే బండి సంజయ్ కు ఉన్న దమ్ము ఏంటి? అని నిలదీశారు. ఢిల్లీ నుండి వచ్చిన దమ్మే తప్ప.. అతడి దగ్గర ఇంకేముందని నారాయణ మండిపడ్డారు. బీజేపీ నేతలు వారి గురించి వారు చూసుకోవాలని తమ గురించి మాట్లాడే అర్హత దమ్ము బండి సంజయ్ కు లేదని నారాయణ తేల్చిచెప్పారు. తమ గురించి ప్రశ్నించే అధికారం బండి సంజయ్ కు ఎవడు ఇచ్చాడని నిలదీశారు. మునుగోడులో పోటీ చేయాలా వద్దా అని తామే నిర్ణయించుకుంటామన్నారు. అంతేగానీ మీ సలహాలు తమకేమీ అక్కర్లేదన్నారు. దమ్ము గురించి మాట్లాడే ముందు కాస్త ఆలోచించుకుని మాట్లాడితే మంచిదని బండి సంజయ్ పై నారాయణ ధ్వజమెత్తారు. మునుగోడు నియోజకవర్గంలో వామపక్షాలకు గతంలో మంచి బలం ఉండేది. ఇప్పుడు కూడా చెప్పుకో దగిన స్థాయిలోనే బలం ఉంది. ఈ నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ప్రజా సంగ్రామ యాత్ర సందర్భంగా లెఫ్ట్ పార్టీలపై విమర్శలు చేశాయి. ఓట్లు చీలకుండా ఉండటానికి లెఫ్ట్ పార్టీలు టీఆర్ఎస్‌కు మద్దతిస్తాయన్నారు. దీంతో తమను ఎన్నికల గోదాలోకి లాగడంతో తాజాగా నారాయణ.. బండి సంజయ్‌పై నిప్పులు చెరిగారు.

## కూసుకుంట్లకు జై అంటున్న జనం, ఆర్.జీ పాల్ కుట్రలు ఘనం

(మొదటి పేజీ తరువాయి..)నేతల ద్వారా దస్త్రుష్ప్రచారం చేస్తున్నారని తెలుస్తుంది.

**రాజగోపాల్‌రెడ్డి గాలం, తెర వెనుక ఈటల**

గతంలో కాంగ్రెస్ పార్టీలో పని చేసి, ప్రస్తుతం టీఆర్ఎస్‌లో స్థానిక ప్రజాప్రతి నిధులుగా చలామణి అవుతున్న కొందరు నేతలను ఆర్.జీ పాల్ తన తాయిలాలతో ఆకర్షించాలని చూస్తున్నారని, గత నెల రోజులుగా ప్రజాప్రతినిధులకు తాయిలాలు అందిస్తున్నారని కొందరు నేతలు బాహటంగానే చెబుతున్నారు. మరికొందరికి ఇచ్చేందుకు కొంత గడువు పెట్టారని, బీజేపీలోకి వెళ్లిన రోజు ఇస్తాను అని హామీ ఇచ్చినట్లు సమాచారం.

**రాజగోపాల్‌రెడ్డికి గెలుపు సులువు అవ్వాలంటే టీఆర్ఎస్ అభ్యర్థిగా కూసుకుంట్ల పోటీ చేయకుండా చేయాలని కుట్రలు**

టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి బరిలో దిగితే రాజగోపాల్‌కు ఓటమి తప్పదని, ఇతరులకు టీఆర్ఎస్ పార్టీ నుండి టికెట్ లభిస్తే ఎలాంటి ఒత్తిడి ఉండదని, సులువుగా గెలిచేందుకు అవకాశాలు ఉంటాయని అభిప్రాయపడుతున్నట్లు వారి సన్నిహితులతో చెప్పుకుంటున్నారు. ఈ క్రమంలో టీఆర్ఎస్ పార్టీలో ముసలం పుట్టేందుకు అనేక ఎత్తులు వేస్తూ, టీఆర్ఎస్ పార్టీలో కొందరిని కోవర్టులుగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. పైగా వారికి తాయిలాల ఎర చూపుతూ దండుమల్కాపురం ఫంక్షన్‌హాల్ మీటింగ్ లాంటి కుట్రలకు ఈటల, రాజగోపాల్‌రెడ్డిలు తెరలేపుతున్నారు. కుట్రలను తిప్పికొట్టేందుకు ఇప్పటికే మంత్రి గుంతకండ్ల రంగంలోకి దిగినట్లు తెలుస్తుంది. పార్టీలో చిచ్చుపెట్టే వారిపై వేటు వేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తుంది.

# మునుగోడులో టిఆర్ఎస్‌దే విజయం

(మొదటి పేజీ తరువాయి..)కోసమే తాను రాజీనామా చేసినట్లు పేర్కొన్న రాజగోపాల్ రెడ్డి... అనంతరం బీజేపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 21న మునుగోడులో బీజేపీ భారీ బహిరంగ సభ నిర్వహించనుంది. కేంద్ర మంత్రి అమిత్ షా ఈ మీటింగ్ కు చీఫ్ గెస్ట్ గా హాజరు కానుండగా... రాజగోపాల్ రెడ్డి అమిత్ షా సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకోనున్నారు. రాజగోపాల్ రెడ్డి రాజీనామాతో మూడు నెలల్లో ఉప ఎన్నికలు తథ్యమని వార్తలు వస్తున్న నేపథ్యంలో... మునుగోడు ఎన్నికలో విజయం సాధించేందుకు బీజేపీతో పాటు టీఆర్ఎస్, కాంగ్రెస్ సర్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే అమిత్ షా సభ కంటే ముందే కేసీఆర్ సభను నిర్వహించాలని టీఆర్ఎస్ భావించింది. ఈ క్రమంలోనే ఈ నెల 20న మునుగోడులో కేసీఆర్ సభను నిర్వహించేందుకు ఆ పార్టీ సిద్ధం అవుతోంది.

# ఒకేదెబ్బకు రెండు పిట్టలు

(మొదటి పేజీ తరువాయి..)చేస్తున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. నియోజకవర్గ వ్యాప్తంగా ఏడు మండలాల నుంచి భారీ ఎత్తున జనసమీకరణతో సభ నిర్వహించాలని పార్టీ ముఖ్యులు నిర్ణయించినట్లు తెలిసింది. త్వరలోనే మండలాల వారీగా ఇన్‌ఛార్జ్‌లను నియమించాలని అధికార పార్టీ ప్రాథమికంగా నిర్ణయించింది. ఇప్పటికే అసమ్మతి నేతలతో చర్చించిన పార్టీ నేతలు, సీఎం కేసీఆర్ నిర్ణయించిన అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని తీర్మానించారు. అప్పటివరకు పార్టీయే అభ్యర్థిగా క్షేత్రస్థాయిలో క్యాడర్‌ను బలోపేతం చేయాలని అధిష్ఠానం ఆదేశించింది. ఉప ఎన్నిక, వివిధ పరిణామాలపై ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలతో సీఎం కేసీఆర్ గురువారం హైదరాబాద్‌లో సుదీర్ఘంగా చర్చించి వారికి పలు అంశాలపై దిశానిర్దేశం చేసినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. మరోవైపు క్షేత్రస్థాయిలో నేతలతో మంత్రి జగదీశ్వర్ రెడ్డి ఇప్పటికే చర్చలు చేశారు. ఇకపోతే బిజెపి అభ్యర్థిగా రాజీనామా చేసిన రాజగోపాల్ రెడ్డి బరిలోకి దిగుతున్నారు. టిఆర్ఎస్, కాంగ్రెస్ తమ అభ్యర్థులు ఎవరన్నది బహుశా ఎన్నికల ప్రకటన వచ్చే వరకు నానబెట్టడం ఖాయం. కమ్యూనిస్టులు ఎటువైపు అన్నది ఇంకా తేలలేదు. వారు బరిలోకి దిగుతారా లేక ఎవరికైనా కొమ్ముకాస్తారా అన్నది చూడాలి. ఈ క్రమంలో తన రాజీనామాకు దారితీసన కారణాలు వివరిస్తూ మండలాల వారీగా రాజగోపాల్‌రెడ్డి సమావేశాలు ఏర్పాటు చేయబోతున్నారు. అభివృద్ధి కోసమే రాజీనామా చేశానని, తన వెంట రావాలని కాంగ్రెస్ క్యాడర్‌కు మాజీ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేస్తున్నారు. మండలాల వారీగా ఆయన పార్టీ ముఖ్యులు, సీనియర్ నేతలతో సమావేశం అవుతున్నారు. గత రెండు రోజుల్లో మర్రిగూడ, నాంపల్లి మండలాల వారీతో సమావేశమైన ఆయన మునుగోడు మండల నేతలతో కూడా సమావేశం కానున్నారని తెలిసింది. ఈ నెల 21న అమిత్‌షా సభను సైతం ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు పార్టీ ముఖ్యులు ఇప్పటికే మండలాల వారీగా పర్యటనలు చేస్తూ క్యాడర్‌ను కార్యోన్ముఖులను చేస్తున్నారు. ఈ క్రమంలో టిఆర్ఎస్ ఎలా ముందుకు వెళుతుందన్నది ఒకటి రెండురోజుల్లో స్పష్టం కానుంది.

# రాష్ట్ర వ్యవహారంపై రాహుల్ వద్దే తేల్చుకుంటా


(మొదటి పేజీ తరువాయి..)పరిణామాలు.. తనను పట్టించుకోకపోవటం.. చండూరు సభలో తనకు జరిగిన అవమానంపై కోమటిరెడ్డి వెంకట్ ఆగ్రహంగా ఉన్నట్టు తెలుస్తోంది.పార్టీని వీడి కాషాయ కండువా కప్పుకున్న దాసోజు శ్రవణ్ చేసిన 'పార్టీలో ఫ్రాంఛైజీ రాజకీయం' ఆరోపణలను ఉటంకిస్తూ.. అధిష్ఠానంపై ఉన్న అక్కసును మీడియా ముందు వెళ్లగక్కారు. చండూరు సభలో జరిగిన అవమానాన్ని సీరియస్‌గా తీసుకున్న వెంకట్రెడ్డి.. నాయకత్వం నుంచి ఎలాంటి బుజ్జగింపు లేకపోవటాన్ని జీర్ణించుకోలేకపోతున్నట్టు కనిపిస్తోంది. సభల గురించి సమాచారం లేకపోవటం.. సభల్లో తిట్టినా పట్టించుకోకపోవటం.. వంటి పరిణామాలన్నింటి వెనుక పీసీసీ అధ్యక్షుడు రేవంత్?రెడ్డి ఉన్నట్టు పరోక్షంగా ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో .పాదయాత్ర గురించి గాంధీభవన్ నుంచి తనకు ఎలాంటి పిలుపు రాలేదంటున్న కోమటిరెడ్డి.. పిలవని పేరంటానికి తాను వెళ్లనని తెగేసి చెబుతున్నారు. తనకు జరిగిన అవమానంపై సంబంధిత నాయకత్వం క్షమాపణలు చెబితేనే.. ప్రచారంలో పాల్గొనటంపై ఆలోచిస్తానన్నారు. పార్టీలో తనకు జరుగుతున్న అవమానాలపై నేరుగా ఢిల్లీ వెళ్లి రాహుల్‌గాంధీ వద్దనే తేల్చుకుంటానని చెబుతున్నారు. 'మునుగోడు ఉపఎన్నికల మీటింగ్ సమాచారం నాకు లేదు. పిలువని పేరంటానికి నేను వెళ్లను. మునుగోడు గురించి నాకు ఏం తెల్వదు. మేము కానిస్టేబుళ్లమని అవమానించారు. మమ్మల్ని అవమానించిన వారు క్షమాపణ చెప్పాలి. రేపటి కాంగ్రెస్ పాదయాత్రకు కూడా నన్ను ఎవరూ పిలువలేదు. చండూరు సభలో ఓ కార్యకర్తతో నన్ను తిట్టించారు. అక్కడే అతన్ని లాగిపెట్టి కొట్టాల్సింది. నాలాంటి సీనియర్‌ను తిట్టిన అతన్ని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి. తిట్టించిన వాళ్లు క్షమాపణ చెప్పాలి. అప్పుడు మాత్రమే అక్కడ ప్రచారంపై ఆలోచన చేస్తా.నని అన్నారు. దాసోజు శ్రవణ్ చెప్పినట్టు.. పార్టీలో ఫ్రాంఛైజీ నడుస్తోంది. ఈ విషయమై దిల్లీలో రాహుల్ గాంధీ దగ్గరనే తేల్చుకుంటానని ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మునుగోడు ఉపఎన్నికకు తాను పూర్తిగా దూరంగా ఉంటున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడారు. ఏ మీటింగ్ జరిగినా నాకు సమాచారం ఇవ్వడం లేదు. నాకు ఆహ్వానం లేని మీటింగ్‌కు నేను ఎందుకు వెళ్తా. నన్ను పార్టీ నుంచి వెళ్లగొట్టే ప్రయత్నం జరుగుతోంది. నన్ను అవమానిస్తే పార్టీ నుంచి వెళ్లిపోతాను అనుకున్నారు. నన్ను వెళ్లగొట్టి కాంగ్రెస్‌ను ఖాళీ చేద్దామనుకుంటున్నారు. అన్ని విషయాలు సోనియా, రాహుల్‌తో మాట్లాడతా. ఉప ఎన్నిక వస్తుంది కాబట్టే కేసీఆర్ కొత్త పెన్షన్లు ఇస్తున్నారు' అని ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.

# మంత్రి సత్యవతికి కవిత పరామర్శ

**హైదరాబాద్,ఆగస్ట్ 12 (సమ సమాజం):** తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ మాతృమూర్తి గుగులోత్ దస్మా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం ఎమ్మెల్సీ కవిత, తెలంగాణ ఫుడ్స్ కార్పొరేషన్ చైర్మన్ రాజీవ్ సాగర్‌తో కలిసి హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని మంత్రి సత్యవతి నివాసంలో పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ.. గుగులోత్ దస్మా ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు.

# ఊరపోచమ్మ బోనాలలో ప్రతి ఒక్కరు పాల్గొనాలి

ముత్యాల భాస్కర్



**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 12(సమ సమాజం):** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ పరిధిలోని ఆదివారం అనగా 14 వ తేదీ న నిర్వహించే శ్రీ శ్రీ శ్రీ ఊర పోచమ్మ బోనాల సందర్భంగా ఆలయ కమిటీ ముత్యాల భాస్కర్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ,తెలంగాణ లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే పండగలలో ముఖ్యమైన పండుగగా పిలవబడే ఈ బోనాల పండుగను ఆషాడమాసం మొదలుకొని శ్రావణమాసం ముగింపు బోనాలుగా శ్రీ శ్రీ శ్రీ ఊర పోచమ్మ మూడు రోజుల పండుగ ఈ బోనాలను నిర్వహించడం ఇబ్రహీంపట్నంలో ఆనవాయితీగా వస్తుంది. శుక్రవారం రోజున దేవాలయ అలంకరణ ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. శనివారం రోజున అమ్మవారికి వడిబియ్యం సమర్పించడం జరుగుతుందని ఆదివారం రోజు బోనాల సందర్భంగా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ అన్ని పురవీధుల నుండి అమ్మవారికి బోనం కుండలు తయారు చేసి అమ్మవారికి ప్రత్యేకంగా వేపఆకు, పరమాన్నంను కుండలో పెట్టి ఊరేగింపుగా మేళతాళాలతో, అంగరంగ వైభవంగా అమ్మవారికి సమర్పించడం జరుగుతుందని అమ్మవారి కృప ఇబ్రహీంపట్నంలో ఉండడం వల్ల ఈరోజు ఇబ్రహీంపట్నం చెరువు వర్షాలతో నిండు కుండలా మారిందని, రైతులకు సుఖశాంతులను, పాడిపంటలను ఇవ్వాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలకు సహకరిస్తున్న నాయిని సత్యనారాయణ, కంచకట్ల భాస్కర్, ఆకుల సురేష్, ముత్యాల రవి, పగడాల రాము మరియు ఆలయ కమిటీ సభ్యులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతూ ఆదివారం జరిగే బోనాల ఉత్సవాలను ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ నలుమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ బోనాల ఉత్సవాలను విజయవంతం చేసి అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని తెలిపారు.

# స్వాతంత్ర్య సమరయోధునికి సమస్యలు చెప్పిన వీఆర్ఏలు



**ఆందోల్-జోగిపేట్, ఆగస్టు 12 (సమ సమాజం):** స్వతంత్ర స్వర్ణోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల వీఆర్ఏలు సంగారెడ్డి జిల్లా జోగిపేట స్వతంత్ర సమరయొదుడు గడిల లింగమయ్య గౌడ్ ను పులమాలలు వెసి శాలువాతో ఘనంగా సన్మానించి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాని ఆయన పాదాలకు నమస్కరించి వేడుకున్నారు. అందోల్ మండల కేంద్రమైన జోగిపేటలో కొనసాగుతున్న వీఆర్ఏల సమ్మెలో భాగంగా స్థానిక స్వతంత్ర సమరయోధుడు లింగయ్య గౌడ్ ను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. అనంతరం తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేలా చేయాలంటూ కాళ్లు మొక్కి వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వీఆర్ఏల జేఏసీ కార్యదర్శి బైండ్ల రమేష్, జిల్లా జెఎసి నాయకులు బాలయ్య, వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షులు మన్నె యాదగిరి, మండల నాయకులు డప్పు యాదయ్య బిక్షపతి, జహంగీర్, అర్జున్, రమేష్, వనిత, మొగులమ్మ గంగమ్మ, మాణెమ్మ తోపాటు మండల పరిధిలోని వీఆర్ఏలు పాల్గొన్నారు.


# ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ కు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపిన కస్తూర్బా విద్యార్థులు



**జోగిపేట్, ఆగస్టు 12 (సమ సమాజం):** అందోలు - జోగిపేట మున్సిపల్ పరిధిలోని గురుకుల పాఠశాలలో ఆటల పోటీలు నిర్వహించారు ఈ కార్యక్రమానికి అందోలు ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు పాఠశాల విద్యార్థులతో పాటు కస్తూరిబా పాఠశాల విద్యార్థినిలు రాఖీలు కట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, వైస్ చైర్మన్ ప్రవీణ్ కుమార్, కౌన్సిలర్లు భవాని నాగరత్నం గౌడ్, దుర్గేష్, కో- అప్షన్ సభ్యుడు పైజల్, పుల్కల్ తెరాస పార్టీ అధ్యక్షులు విజయ్ కుమార్, నాయకులు సంతోష్ పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

# పోచమ్మ బోనాల ఉత్సవాలను జయప్రదం చేయండి

ఆకుల మమతా ఆనంద్



**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 12(సమ సమాజం):** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ పరిధిలోని బృందావన్ నగర్ కాలనీ వచ్చే ఆదివారం అనగా 14 వ తేదీ న నిర్వహించే శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ బోనాల సందర్భంగా అమ్మవారికి వడిబియ్యం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన దేవాలయ కమిటీ చైర్మన్ ఆకుల ఆనంద్ కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, బోనాల సందర్భంగా అమ్మవారి దేవాలయానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయాన్ని అంగరంగ వైభవంగా తీర్చిదిద్దామని 11, 12, 13 వార్డుల ప్రజలు మరియు మున్సిపల్ సభ్యులను ప్రజలు అందరూ కూడా పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా కోరారు. అమ్మ వారి భవనాలకు చాలా మంది పెద్దలు, విఐపిలు కూడా హాజరు కాబోతున్నారని, వారందరి సమక్షంలో అమ్మవారిని దర్శించుకోవడం మన అదృష్టంగా భావించవచ్చు అని, ఈ ఆలయ చైర్మన్గా నన్ను ఎన్నుకొని ఆలయ సభ్యులు కావచ్చు, భక్తులు కావచ్చు నా మీద చాలా బరువైన బాధ్యతను పెట్టడం జరిగిందని, ఈ నిర్మాణం ఆకుల నందుతో మాత్రమే జరుగుతుంది అని నన్ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. వారందరి కోరికమేరకు ఈ నిర్మాణ బాధ్యతలు నేను తీసుకున్నానని ఈ ఆలయ నిర్మాణానికి చాలా తక్కువగా ఖర్చు అవుతుందని అనుకున్నాను కానీ నా అంచనాకు మించి ఖర్చులు పెరిగిపోతుందని, దాతలు కూడా చాలా మంచిగా సహకరిస్తున్నారని ఎవరికి తోచినంత వారు సహకరిస్తున్నారని, గత 3 సంవత్సరాల నుండి ఈ ఆలయాన్ని అంచెలంచెలుగా అభివృద్ధి చేసుకుంటూ వస్తున్నామని కాబట్టి బృందావన్ కాలనీ ప్రజలకు బోనాలకు దేవుడు మన మధ్యకు వచ్చాడని ఇది మన అదృష్టంగా భావించి పెద్ద ఎత్తున భక్తులందరూ పాల్గొని బోనాల ఉత్సవాలను విజయవంతం చేద్దామని తెలుపుతూ అమ్మవారి కృప మున్సిపల్ ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నాను అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఆకుల మమత ఆనంద్, కృష్ణ, భక్తులు తదితరులు పాల్గొన్నారు. పోచమ్మ తల్లి కరుణ కటాక్షంలు ఎల్లప్పుడూ ఉంటాయని వారు అమ్మవారిని వేడుకున్నట్టు కోరారు.

# గోల్కొండ కోటలో పంద్రాగస్ట్ వేడుకలు

## ఏర్పాట్లను పరిశీలించిన సిఎస్ సోమేశ్ కుమార్



**హైదరాబాద్,ఆగస్ట్ 12 (సమ సమాజం):** పంద్రాగస్ట్ వేడుకలను మళ్లీ గోల్కొండ కోటలో నిర్వహించనున్నారు. గత రెండేళ్లుగా కరోనా కారణంగా వేడుకలను పబ్లిక్ గార్డెన్లో నిర్వహించారు. ఈ క్రమంలో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ పరిశీలించారు. పోలీసు, జీహెచ్ఎంసీ, ఆర్ అండ్ బీ, సమాచారశాఖ, సాంస్కృతిక, రెవెన్యూ శాఖల అధికారులతో వేడుకల ఏర్పాట్లపై సీఎస్ సోమేష్ కుమార్ సమీక్ష చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేలా భద్రత, ట్రాఫిక్ నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ నెల 15వ తేదీ ఉదయం ముఖ్యమంత్రి కేసీఆర్.. గోల్కొండ కోటలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తారని తెలిపారు. సోమేశ్ కుమార్ వెంట నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్,స్పెషల్ సెక్రటరీ అరవింద్ కుమార్, ఇంటెలిజెన్స్ చీఫ్ అనిల్ కుమార్ ఉన్నారు.

# సోదరుడు కెటీఆర్‌కు రాఖీ కట్టిన కవిత

## చిన్ననాటి ఫోటోలు షేర్ చేసిన కెటిఆర్



**హైదరాబాద్,ఆగస్ట్ 12 (సమ సమాజం):** సోదర సోదరీమణుల మధ్య ప్రేమానురాగాలకు ప్రతీక అయిన రాఖీ పండుగ సంబురాలు అంబరాన్నంటాయి. రాష్ట్ర వ్యాప్తంగా రాఖీ పండుగ సందడి కనిపించింది. సోదరీమణులందరూ తమ సోదరులకు రాఖీ కట్టి స్వీట్లు తినిపించారు. ఈ క్రమంలో ప్రగతి భవన్‌లో జరిగిన రక్షాబంధన్ వేడుకల్లో ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు. తన సోదరుడు, మంత్రి కల్వకుంట్ల తారక రామారావుకు ఎమ్మెల్సీ కవిత రాఖీ కట్టి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికి ఎమ్మెల్సీ కవిత రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. రాఖీ పండుగ సందర్భంగా తెలంగాణ ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ చిన్ననాటి ఫోటోలను ట్విట్టర్ వేదికగా షేర్ చేశారు. ఆ ఫోటోలు అందర్నీ ఆకట్టుకుం టున్నాయి. కొన్ని బంధాలు ఎప్పటికీ ప్రత్యేకం అంటూ సోదరి కవిత (ఐజీలతిబిరజీ)తో పాటు కేటీఆర్ తన చిన్ననాటి పోటో షేర్ చేశారు. అలాగే కేటీఆర్ తన కుమార్తె అలేఖ్య, కుమారుడు హిమన్షు ఫోటోను షేర్ చేశారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ సందర్భంగా మంత్రి కేటీఆర్ మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

# ఎంసెట్ ఫలితాలు విడుదల చేసిన మంత్రి సబిత

ఇంజినీరింగ్‌లో లక్ష్మీసాయి లోహిత్‌రెడ్డికి మొదటి ర్యాంకు ○ త్వరలోనే కౌన్సిలింగ్ మొదలు పెడతామని వెల్లడి



**హైదరాబాద్,ఆగస్ట్ 12(సమ సమాజం):** తెలంగాణ రాష్ట్ర ఎంసెట్ ఫలితాలు విడుదలయ్యాయి. విద్యాశాఖ మంత్రి సబిత ఇంద్రారెడ్డి ఫలితాలను విడుదల చేశారు. ఇంజినీరింగ్, అగ్రికల్చర్‌లో టాప్-10 ర్యాంకులు సాధించిన వారి పేర్లను వెల్లడించారు. హైదరాబాద్ జేఎన్‌టీయూహెచ్ ప్రాంగణంలో మంత్రి ఫలితాలను విడుదల చేశారు. ఇంజినీరింగ్, అగ్రికల్చర్‌లో టాప్-10 ర్యాంకులను మంత్రి వెల్లడించారు. ఇంజినీరింగ్‌లో లక్ష్మీసాయి లోహిత్‌రెడ్డికి మొదటి ర్యాంకు, సాయిదీపికకు రెండో ర్యాంకు, కార్తికేయకు మూడో ర్యాంకు సాధించినట్లు వివరించారు. త్వరలోనే కౌన్సెలింగ్ ప్రారంభిస్తామని మంత్రి సబిత తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో ఎంసెట్ కౌన్సెలింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎంసెట్ కౌన్సెలింగ్ సెంటర్‌లో కళాశాలలు, కోర్సుల వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని సబిత ఇంద్రారెడ్డి అన్నారు. అగ్రికల్చర్‌లో నేహాకు మొదటి ర్యాంకు, రోహిత్‌కు రెండో ర్యాంకు, తరుణ్‌కుమార్‌కు మూడో ర్యాంకు సాధించారు. గత నెల 18 నుంచి 21 వరకు ఇంజినీరింగ్, 30, 31న అగ్రికల్చర్, ఫార్మా ఎంసెట్ పరీక్షలు నిర్వహించారు. ఇంజినీరింగ్‌కు 1,56,812 మంది, అగ్రికల్చర్, ఫార్మా కోర్సుల కోసం 80,575 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఈ ఏడాది ఎంసెట్ ఇంజనీరింగ్ విభాగంగా లక్ష్మీసాయి లోహిత్ రెడ్డి ఫస్ట్ ర్యాంక్ సాధించగా.. సాయి దీపిక సెకండ్, కార్తికేయ థర్డ్ ప్లేస్ లో నిలిచారు. ఇక అగ్రికల్చర్ విభాగంలో నేహాకు ఫస్ట్ ర్యాంక్ రాగా.. రోహిత్ సెకండ్ ర్యాంక్ సాధించారు. ఎంసెట్ కౌన్సెలింగ్ సెంటర్లలో కాలేజీల వివరాలు తెలుసుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. మరోవైపు ఈ సెట్ ఫలితాలను సైతం మంత్రి సబితా ఇంద్రారెడ్డి రిలీజ్ చేశారు. ఈసెట్ లో 90.69శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. 22,001 మంది పరీక్ష రాయగా 19,953 మంది క్వాలి÷ అయ్యారు. జులై 18 నుంచి 21 వరకు ఎంసెట్ ఇంజనీరింగ్ స్ట్రీమ్ ఎగ్జామ్స్ జరిగాయి. జులై 30, 31వ తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మా ఎంట్రెన్స్ ఎగ్జామ్ నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 3 నుంచి 6గంటల వరకు సెకండ్ సెషన్ లో పరీక్ష జరిపారు. ఎంసెట్ ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్షలకు 1,56,812 మంది హాజరుకాగా, అగ్రికల్చర్ అండ్ ఫార్మా కోర్సులకు నిర్వహించిన పరీక్షను 80,575 మంది రాశారు.

# ఎంసెట్ ఇంజనీరింగ్ షెడ్యూల్ విడుదల

21నుంచి 29 వరకు ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్

23 నుంచి 30 వరకు ధ్రువపత్రాల పరిశీలన

సెప్టెంబరు 6న ఇంజినీరింగ్ మొదటి విడత సీట్ల కేటాయింపు



**హైదరాబాద్,ఆగస్ట్ 12 (సమ సమాజం):** టీఎస్ ఎంసెట్ ఫలితాలను ఉదయం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి విడుదల చేయగా, వెంటనే కౌన్సింగ్ షెడ్యూల్ కూడా ప్రకటించారు. ఇంజినీరింగ్‌లో 80.41 శాతం మంది ఉత్తీర్ణులవగా, అగ్రికల్చర్‌లో 88.34 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని మంత్రి వెల్లడించారు. ఎంసెట్ ఫలితాలు విడుదలైన నేపథ్యంలో కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను కూడా విడుదల చేశారు. మూడు విడతల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. మొదటి విడుత షెడ్యూల్.. ఆగస్టు 21 నుంచి 29 వరకు ఆన్ లైన్ స్లాట్ బుకింగ్ చేపడతారు. 23 నుంచి 30 వరకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుంది. అలాగే 23 నుంచి సెప్టెంబరు 2 వరకు వెబ్ ఆప్షన్లు ఎంచుకునే అవకాశం ఇస్తారు. సెప్టెంబరు 6న ఇంజినీరింగ్ మొదటి విడత సీట్ల కేటాయింపు చేపడతారు. రెండో విడుత షెడ్యూల్.. మేరకు సెప్టెంబరు 28, 29న రెండో విడత స్లాట్ బుకింగ్ లు చేపడతారు. అలాగే సెప్టెంబరు 30న రెండో విడత ధ్రువపత్రాల పరిశీలన ఉంటుంది. సెప్టెంబరు 28 నుంచి అక్టోబరు 1 వరకు వెబ్ ఆప్షన్లకు అవకావం ఇస్తారు. అక్టోబరు 4న రెండో విడత ఇంజినీరింగ్ సీట్ల కేటాయింపు ఉంటుంది. మూడో విడుత షెడ్యూల్ ప్రకారం అక్టోబరు 11 నుంచి తుది విడత కౌన్సెలింగ్, అక్టోబరు 13న తుది విడత ధ్రువపత్రాల పరిశీలన, అక్టోబరు 11 నుంచి 14 వరకు వెబ్ ఆప్షన్ల నమోదు ఉంటుంది. అక్టోబరు 17న తుది విడత ఇంజినీరింగ్ సీట్ల కేటాయింపు చేపడతారు. అక్టోబరు 20న స్పాట్ అడ్మిషన్ల మార్గదర్శకాలు జారీ చేస్తారు. ఎంసెట్ ఇంజినీరింగ్ పరీక్షలను జులై 18 నుంచి 21 వరకు నిర్వహించారు. మొత్తం 1,72,243 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. పరీక్షకు 1,56,860 మంది హాజరయ్యారు. వీరిలో 1,26,140 మంది ఉత్తీర్ణత (80.41 శాతం) సాధించారు. అదేవిధంగా అగ్రికల్చర్, మెడికల్ స్ట్రీమ్‌కు 94,476 మంది దరఖాస్తు చేసుకోగా, 80,575 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 71,180 మంది (88.34 శాతం) అర్హత సాధించారు.

# వికారాబాద్ నూతన కలెక్టరేట్ పరిశీలించిన మంత్రి సబిత

16న ప్రారంభోత్సవానికి రానున్న సిఎం కెసిఆర్

**వికారాబాద్, ఆగస్ట్ 12 (సమ సమాజం):** వికారాబాద్ జిల్లా నూతన కలెక్టరేట్‌ను సీఎం కేసీఆర్ ఈ నెల 16వ తేదీన ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయాన్ని విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఎమ్మెల్యేలు డాక్టర్ మెతుకు ఆనంద్, కాలేరు యాదయ్య, పట్నం నరేందర్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, కలెక్టర్ నిఖిల, ఎస్పీ కోటి రెడ్డి, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్, జడ్పీ వైస్ చైర్మన్ విజయ్ కుమార్ కూడా కార్యాలయాన్ని సందర్శించిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా అధికారులతో సమావేశం నిర్వహించారు. సభాస్థలి, పార్కింగ్, ఇతర ఏర్పాట్లపై సమీక్షించారు. అనంతరం బహిరంగ సభ స్థలం, వేదికలను పరిశీలించి మంత్రి పలు సూచనలు చేశారు. నియోజకవర్గాల వారీగా వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు. మినిట్ టూ మినిట్ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని పేర్కొన్నారు. ఒక్కో విభాగానికి జిల్లా స్థాయి అధికారులను నియమించి నిశితంగా పరిశీలించాలని, ఎలాంటి లోటు పాట్లు లేకుండా చూడాలన్నారు. అధికారులు మొత్తం కార్యక్రమానికి సంబందించిన వివరాలను మ్యాపుల ద్వారా మంత్రికి వివరించారు. ముఖ్యమంత్రి పర్యటనకు మరో మూడు రోజులు మిగిలి ఉండటంతో మిగిలిన పనులను వేగవంతం చేయాలని అధికారులను మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశించారు.

# ప్రగతి భవన్‌లో రాఖీ సందడి



**హైదరాబాద్,ఆగస్ట్ 12 (సమ సమాజం):** రక్షా బంధన్ వేడుకలు ప్రగతి భవన్ లో ఘనంగా జరిగాయి. అక్కాచెల్లెళ్ల రాకతో సీఎం కేసీఆర్ నివాసంలో సందడి నెలకొంది. అక్కలు లలితమ్మ, లక్ష్మమ్మ, జయమ్మ, చెల్లెలు వినోదమ్మ కేసీఆర్ కు రాఖీలు కట్టారు. అనంతరం సీఎం వాళ్ల కాళ్లు మొక్కి ఆశీర్వాదం తీసుకున్నారు. మరోవైపు సీఎం కేసిఆర్ మనువడు, మనుమరాలు రక్షా బంధన్ వేడుకలు జరుపుకున్నారు. అన్న హిమాన్షుకు అలేఖ్య రాఖీ కట్టింది. అనంతరం మనువడు, మనుమరాలు కేసీఆర్, శోభమ్మ ఆశీర్వాదం తీసుకున్నారు.

# మునుగోడులో కాంగ్రెస్‌దే విజయం

బిజెపి అసత్య ప్రచారాలతో ప్రజలు విసిగిపోయారు

పాదయాత్రలో విరుచుకు పడ్డ కాంగ్రెస్ నేత పొన్నం



**వేములవాడ, ఆగస్ట్ 12 (సమ సమాజం):** మునుగోడు ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయం ఖాయమని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ జోస్యం చెప్పారు. ఎన్నికల కోసం తాపత్రయపడుతూ బీజేపీ అసత్య ప్రచారాలకు దిగిందని, ప్రజలు సరైన సమాధానం చెబుతారన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి రాగానే ముంపు గ్రామాల సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీనిచ్చారు. అలాగే డబుల్ బెడ్ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి నిరసిస్తూ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ చేపట్టిన పాదయాత్ర కొనసాగుతోంది. శుక్రవారం వేములవాడ నంది కామన్ మారుపాక వద్దకు చేరుకుంది. కాంగ్రెస్ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ... బండి సంజయ్ ఇప్పటివరకు పార్లమెంట్ నియోజకవర్గానికి చేసింది ఏమీ లేదన్నారు. మనిషి బతికుండగానే జీవచ్ఛవంలా మారుస్తూ వికృత చేష్టలకు పాల్పుడుతున్న పార్టీ బీజేపీనని, మతతత్వాన్ని రెచ్చగొడుతూ కేవలం రాజకీయ పబ్బం మాత్రమే గడుపుకొంటోందని విమర్శించారు. సామాజిక మాధ్యమాల ద్వారా దేశ ప్రజలకు తామే స్వాతంత్రం తెచ్చామన్నట్లుగా బీజేపీ అసత్య ప్రచారాలను రుద్దుతోందని ఆరోపించారు. స్వాతంత్రం తెచ్చిన తొలి రోజుల్లో చేసిన అనేక రంగాల అభివృద్ధి నేటి దేశానికి సురక్షితమైన, ఆర్థిక సుస్థిరతను సాధించిందని చెప్పుకొచ్చారు. దేశ స్వాతంత్ర ఉద్యమం నాటి నుండి ప్రజాసంక్షేమ వరకు దేశంలో కాంగ్రెస్ ప్రజలకు అండగా నిలిచిందన్నారు. 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలను అందించిన ఘనత కూడా కాంగ్రెస్ పార్టీదేనని వెల్లడించారు. కాంగ్రెస్ హయాంలో ఏర్పాటు చేసిన టెక్స్ టైల్ పార్కును ఇప్పటివరకు మళ్ళీ అభివృద్ధి చేయడంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని నిలదీశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆస్తులన్నీ కార్పొరేట్ రంగాలకు తాకట్టు పెడుతూ నిర్వీర్యం చేస్తోందని.. ఇప్పటికే అనేక ప్రభుత్వ రంగ సంస్థలను ఆదాని, అంబానీలకు అప్పగించారని తెలిపారు.




# చలన చిత్రం




## రొటీన్ కథతో ..రొటీన్‌గా మాచర్ల నియోజకవర్గం

Oచెక్.. రంగ్ దె చిత్రాలు నిరాశ పరిచాక కొంచెం రూటు మార్చి పక్కా మాస్ మసాలా సినిమా చేశాడు యంగ్ హీరో నితిన్. అదే.. 'మాచర్ల నియోజకవర్గం'. ఎడిటర్ రాజశేఖర్ రెడ్డి దర్శకుడిగా మారి రూపొందించిన తొలి చిత్రమిది. ప్రోమోల్లో మంచి కమర్షియల్ ఎంట్టంల్గ÷నర్ లాగా కనిపించిన ఈ చిత్రం ఈ రోజే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సిద్దార్థ్ (నితిన్) కాలేజీ చదువు పూర్తి చేసి ఆడుతూ పాడుతూ జీవితాన్ని సాగిస్తున్న కుర్రాడు. తర్వాత అతను సివిల్ సర్వీసెస్ పాసై గుంటూరు జిల్లాలోని మాచర్ల నియోజకవర్గంలో కలెక్టరుగా అడుగు పెడతాడు. ఆ ప్రాంతాన్ని తన గుప్పెట్లో పెట్టుకుని ఏలుతున్న ఎమ్మెల్యే రాజప్ప.. ప్రతిసారీ పోటీయే లేకుండా ఏకగ్రీవంగా ఎమ్మెల్యేగా గెలుస్తుంటాడు. రాజప్పకు సిద్దార్థ్ ఎదురు వెళ్లడమే కాక ఆ నియోజకవర్గంలో ఎన్నికలు జరిపించాలని కంకణం కట్టుకుంటాడు. దీంతో ఇద్దరి మధ్య పోరు పతాక స్థాయికి చేరుకుంటుంది. మరి ఈ పోరాటంలో ఎవరు గెలిచారన్నది కథ. అయితే కథా..కథనం రొటీన్‌గా ఉండడంతో కొత్తదనమేదీ కనిపించదు. వైజాగ్ బీచ్ లో అమ్మాయి తన స్నేహితులతో నడుస్తుంటుంది. అక్కడున్న పోకిరి బ్యాచ్ ఆమెను ఆటపట్టిస్తుంది. వెంటనే ఆమె మీకుందిరా.. ఒకడొస్తాడు.. మీ బెండు తీస్తాడు అంటుంది. వాళ్లేమో ఎవడే వాడు.. రమ్మను అని వాళ్లు సవాల్ చేస్తారు. ఈ మాండేటరీ బిల్డప్ పూర్తవగానే హీరో ఎంట్రీ ఇస్తాడు. ఆ తర్వాత ఆటోమేటిగ్గా హీరో స్టెప్పులు ఇరగదీస్తూ యూత్ కు ఒక మెసేజ్ ఇస్తూ సాంగ్. ఆ అమ్మాయి మినిస్టర్ కూతురు. హీరో అంటే పడిచచ్చిపోతుంటుంది. ఇలాంటి బ్యాగ్రౌండ్ ఉన్న సెకండ్ హీరోయిన్ని హీరో అస్సలు పట్టించుకోకూడదు. పట్టించుకోడు. నా మనసుకు నచ్చిన అమ్మాయి ఎక్కడుందో ఏంటో అంటూ ఊహల్లోకి వెళ్లడం ఆలస్యం.. ఎదురుగా అందాల రాశి అయిన హీరోయిన్ ప్రత్యక్షం. తొలి చూపులోనే ఆమెతో ప్రేమతో.. ఆమె వెంట పడుతూ అల్లరి.. ఈ రొమాన్స్ మధ్యలో కమెడియన్ వెన్నెల కిషోర్ రెడీ. కథానాయికతో ఒక వైపు రొమాన్స్.. కమెడియన్ తో కలిసి ఇంకోవైపు కామెడీ.. మధ్య మధ్యలో పాటలు.. హీరో ఎలివేషన్ కోసం అప్పుడప్పుడూ ఒక ఫైట్.. ఈ కథ ముదిరి పాకాన పడుతుండగా.. విలన్ తో హీరోకు డిష్యుం డిష్యుం. అక్కడి నుంచి నువ్వా నేనా అంటూ ఇద్దరి మధ్య పోరు.. చివరికి హీరో పైచేయి. ఇలా రొటీన్ కథతో మాచర్ల నియోజకవర్గం సాగింది. కొత్త దర్శకుడంటే ఎంతో కొంత కొత్తదనం కోసం ప్రయత్నించి ఉంటాడని.. ఏదో ఒక ప్రత్యేకత చూపించి ఉంటాడని అనుకుంటారు. అనగనగా ఒక టౌన్.. అందులో ఓ విలన్.. అక్కడంతా అతడి గుప్పెట్లోనే ఉంటుంది. 30 ఏళ్ల నుంచి ఆ ఊర్లో ఎలక్షనే లేదు. ప్రతిసారీ విలనే ఎమ్మెల్యే. పోటీగా నామినేషన్ కూడా ఎవ్వరూ వేయరు. అప్పుడు అనుకోకుండా హీరో ఆ ప్రాంతంలో అడుగు పెడతాడు. విలన్ని ఢీకొడతాడు. నేనెవరో తెలుసా అంటూ విలన్ ఎగిరెగిరి పడడం.. నువ్వెవరైతే నాకేంటి అంటూ హీరో అతడి మీద పడిపోవడం.. ఈ ఫార్మాట్లో వందల సినిమాలు వచ్చాయి. కాకపోతే ఎప్పుడూ హీరో పోలీస్ అవతారమో.. ఇంకోటో ఎత్తుతాడు. ఇక్కడ మాత్రం హీరో కలెక్టర్. ఐఏఎస్ అధికారి కదా.. బుర్ర వాడి విలన్ని దెబ్బ కొడతాడేమో.. డిఫరెంట్ ట్రీట్మెంట్ ఉంటుందేమో అనుకుంటే అలాంటిదేమీ ఆశించడానికి వీల్లేదు. సూటూ బూటు వేసుకుని కనిపిస్తాడు తప్ప చేసేవన్నీ మాస్ ఫైట్లే. ఈ మాత్రం దానికి హీరో కలెక్టరే ఎందుకవ్వాలి కలెక్టర్ గా చూపించడం వల్ల సినిమాకు వచ్చిన కొత్త కలరేంటి అనే ప్రశ్నలకు సమాధానం ఉండదు. నితిన్ స్టైలింగ్ ఇంకొంచెం బెటర్ గా ఉండడానికి తప్ప ఈ పాత్ర వల్ల ప్రత్యేకంగా ఒనగూరిన ప్రయోజనం ఏమీ లేదు. కథాకథనాల్లో ఎక్కడా కూడా తర్వాత ఏం జరుగుతుందనే క్యూరియాసిటీకి అవకాశం లేకుండా పరమ రొటీన్ గా లాగించేశారు. మాస్ ప్రేక్షకులు కూడా ఇదేందిరా అంటూ ఫీలయ్యే రొటీన్ సినిమా.




## నవ్వుతూనే ఉన్నా..లోప మాత్రం టెన్షన్

### కార్తికేయ-2 ప్రీరిలీజ్ ఫంక్షన్‌లో హీరో నిఖిల్


పైకి నవ్వుతున్నప్పటికీ చాలా టెన్షన్ గా ఉన్నానని యంగ్ హీరో నిఖిల్ సిద్దార్థ అన్నారు. ఆయన హీరోగా నటించిన లేటెస్ట్ మూవీ కార్తికేయ 2 మూవీ భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను గ్రాండ్‌గా జరిపారు. ఈ కార్యక్రమానికి యంగ్ హీరోలు అడివి శేష్, సిద్ధు జొన్నలగడ్డ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో నిఖిల్ పలు ఆసక్తికరమైన విషయాలను చెప్పుకొచ్చారు.'చందూ మొండేటి 'కార్తికేయ 2' కథ చెప్పిన దగ్గర నుంచి ప్రతీ ఒక్కరం ఈ కథ కోసం రెండున్నరేళ్లుగా కష్టపడుతూ వచ్చాము. రెండున్నరేళ్ళుగా మేము పడిన కష్టం.. ఇప్పుడు మీ ముందుకు రావడానికి రెడీ అవుతోంది. నిజం చెప్పాలంటే నేను పైకి నవ్వుతున్నప్పటికీ చాలా టెన్షన్ గానే ఉన్నాను. ఈ ఫంక్షన్ కి చీఫ్ గెస్టుగా అడివి శేష్ రావడం చాలా ఆనందంగా ఉంది. కంటెంట్ ఉంటే చాలు పెద్ద బ్జడెట్ అవసరం లేదు..అని 'మేజర్' సినిమాతో ఆయన నిరూపించారు. సింగీతం శ్రీనివాసరావుగారు చేసిన ప్రయోగాలు చూస్తూ పెరిగాను. కొత్తదనం కోసం తపించడమనేది ఆయన నుంచే ఇన్స్పిరేషన్‌గా తీసుకున్నాను. అలాంటి ఆయన మా కార్తికేయ సినిమాపై నమ్మకాన్ని వ్యక్తం చేయడం ఆనందంగా ఉంది. ఈ మధ్య థియేటర్లకు జనాలు రావడం లేదని అంటున్నారు. కంటెంట్ ఉన్న సినిమాలకు జనాలు వస్తారనే విషయం మరిచిపోకూడదు. అందుకు ఉదాహరణగా ఇటీవల వచ్చిన 'మేజర్' .. 'బింబిసార' .. 'సీతా రామం' సినిమాలే. కథలో విషయం ఉంటే థియేటర్స్ హౌజ్ ఫుల్ అవుతాయి. మా సినిమా నిర్మాతలు మాకు అందించిన సహకారం నెక్స్ లెవెల్లో ఉంది అన్నారు.

## ఆర్‌సి-15 పై అప్‌డేట్ ఇవ్వండి

### దిల్‌రాజ్‌ను ట్రోల్ చేస్తున్న చెర్రీ ఫ్యాన్స్



స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు మరోసారి వార్తల్లో నిలిచారు. అయితే ఆయనని వార్తల్లో నిలిచేలా చేసింది మాత్రం మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ఫ్యాన్స్. దిల్ రాజు ప్రస్తుతం ఇతర ప్రాజెక్ట్ లు చేస్తూనే తన బ్యానర్ లో అత్యంత ప్రతిష్టాత్మకంగా మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ శంకర్ లతో ఆర్‌సి15 ని అత్యంత భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. కియారా అద్వానీ హీరోయిన్ గా నటిస్తున్న ఈ మూవీని సమకాలీన రాజకీయాంశాలపై సెటైరికల్ మూవీగా తెరకెక్కిస్తున్నారు. పీరియడిక్ టచ్ తో పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ గా రూపొందుతున్న ఈ మూవీ షూటింగ్ ని ఇటీవల దర్శకుడు శంకర్ ఆపేసి కమల్ హాసన్ 'ఇండియన్ 2' కోసం వెళ్లిపోయిన విషయం తెలిసిందే. ఆ కారణంగా రామ్ చరణ్ మూవీ ఆలస్యం అయ్యే ప్రమాదం వుందని ఫ్యాన్స్ ఆందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఆర్‌సి 15 కు సంబంధించిన అప్ డేట్ ఇవ్వమని మెగా అభిమానులు ట్విట్టర్ వేదికగా దిల్ రాజుని డిమాండ్ చేస్తుండటం వైరల్ గా మారింది. 'వేకప్ దిల్ రాజు'అనే హ్యాష్ ట్యాగ్ తో దిల్ రాజుని మెగా ఫ్యాన్స్ నెట్టింట ట్రెండ్ చేస్తున్నారు. ఇప్పటికే 35 వేలకు పైగా ట్వీట్ లు చేయడంతో దిల్ రాజు సోషల్ మీడియా ట్విట్టర్ లో వైరల్ గా మారారు.




## పవన్‌కు అస్వస్థత..వినోదరాయం షూటింగ్‌కు దూరం

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ రీసెంట్ గా బ్యాక్ టు బ్యాక్ రీమేక్ లతో ప్రేక్షకుల ముదుకొచ్చారు. బాలీవుడ్ హిట్ ఫిల్మ్ 'పింక్' ఆధారంగా తెరకెక్కిన 'వకీల్ సాబ్' సక్సెస్ కావడంతో ఆ తరువాత కూడా మరో రీమేక్ నే ఆశ్రయించాడు. అయితే ఈ సారి మలయాళ రీమేక్ ని ఎంచుకున్నారు. మలయాళంలో సూపర్ హిట్ అయిన 'అయ్యప్పనుమ్ కోషియుమ్' ఆధారంగా తెలుగులో 'భీమ్లా నాయక్'గా రీమేక్ చేసిన విషయం తెలిసిందే. ఈ మూవీ కూడా హిట్ అనిపించుకుంది.అయితే ఈ మూవీ తరువాత కూడా తమిళ హిట్ మూవీని తెలుగులో రీమేక్ చేయాలని ప్లాన్ చేశారు. సముద్రఖని నటించి తెరకెక్కించిన మూవీ 'వినోదాయ సితం'. తమిళంలో థియేటర్లలో రిలీజ్ కాని ఈ మూవీ నేరుగా ఓటీటీలో విడుదలై విమర్శకుల ప్రశంసల్ని సొంతం చేసుకుంది. తెలుగులో త్రివిక్రమ్ చేత భారీ మార్పులు చేయించిన పవన్ కల్యాణ్ మరో సారి దేవుడి పాత్రలో నటించేందుకు రెడీ అంటూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.ఇందులోని యంగ్ హీరో క్యారెక్టర్ లో సాయి ధరమ్ తేజ్ కనిపించబోతున్నాడు. కృతిక శెట్టి హీరోయిన్ గా నటించ నుందని వార్తలు వినిపించాయి. సముద్రఖని దర్శకత్వంలో తెరపైకి రానున్న ఈ మూవీ పూజా కార్యక్రమాలు కూడా పూర్తి చేశారు. లాంఛనంగా సెట్స్ పైకి వెళ్లడమే తరువాయి. అయితే ఇదే సమయంలో పవన్ కల్యాణ్ అనారోగ్యానికి గురయ్యారు. తీవ్ర జ్వరం రావడంతో ఇంటికే పరిమితం అయిపోయారు. పవన్ ని పరీక్షించిన డాక్టర్లు విశ్రాంతి తీసుకోవాలని సూచించడంతో గత కొన్ని రోజులుగా పవన్ విశ్రాంతి తీసుకుంటున్నారు. ప్రస్తుతం జ్వరం నుంచి కోలుకున్నా.. షూటింగ్ కోసం సెట్ లోకి అడుగు పెట్టడానికి ఆయన పూర్తిగా సిద్ధం కాలేదని ఇంకా అనారోగ్యం నుంచితేరుకోలేదని తెలుస్తోంది. ఆ కారణంగానే 'వినోదాయ సితం' షూటింగ్ ఆలస్యం అవుతూ వస్తోందని చెబుతున్నారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at Panidhar **PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in